అన్నదాతల చెంతకు సాంకేతిక పరిజ్ఞానం

- వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తాం
- రైతువేదికల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో కర్షకులకు ఆన్‌లైన్‌లో శిక్షణ
- 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు

కొణిజర్ల: రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కూసుమంచిలో..

బోనకల్లులో..

కూసుమంచి/ బోనకల్లు/ కొణిజర్ల, మార్చి 6: సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్నదాతలకు చెంతకు చేరవేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ పరిజ్ఞానం ద్వారా వ్యవసాయానికి సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు వారికి తెలియజేస్తామని, వారికి పూర్తి అవగాహన కల్పిస్తామని అన్నారు. రైతువేదికల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో కర్షకులకు నేరుగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఆయా రైతువేదికల్లో 'రైతు నేస్తం' పేరుతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. డిజిటల్ సేవల్లో భాగంగా శాస్త్రవేత్తలు, నిపుణులు ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ వీసీలో ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు నగరానికి కేటీఆర్ రాక

ఖమ్మం, మార్చి 6: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఖమ్మం రానున్నారు. పార్టీ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు మామిళ్లగూడెంలోని వీవీసీ ఫంక్షన్ హాలులో జరిగే ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు ఖమ్మం బైపాస్ రోడ్‌లోని గాయత్రి గ్రాండ్‌లో జరిగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అభినందన-కృతజ్ఞత సభలో, స్థానికంగా జరిగే వివిధ కార్యక్రమాల్లో నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొంటారు. ఎంపీ నామా క్యాంప్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో ఈ వివరాలు తెలిపింది.

నా కుమారుడి వివాహానికి రండి

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు ఖమ్మం ఎంపీ నామా ఆహ్వానం

కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఎంపీ నామా

ఖమ్మం, మార్చి 6: ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు రెండో కుమారుడు భవ్యతేజ వివాహం ఈ నెల 15న శేష మనోజ్ఞ జ్యోతితో జరగనుంది. ఈ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు హైదరాబాద్‌లోని వారి వారి స్వగృహాల్లో నామా నాగేశ్వరరావు బుధవారం ఆహ్వాన పత్రికలు అందించారు. కుటుంబ సమేతంగా వచ్చి నూతన జంటను దీవించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి: ఎమ్మెల్యే రాగమయి

సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, మార్చి 6: మండలంలోని రామచంద్రాపురంలో బుధవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిపైనే తమ ప్రభుత్వం దృష్టి సారించిందని అన్నారు. వెనుకబడిన గ్రామాలను గుర్తించి త్వరితగతిన పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీవో వాల్మీకి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పాలేరు సంత సిండికేట్‌కు యత్నం!

కూసుమంచి, మార్చి 6: మండలంలోని పాలేరు సంత వేలంలో ఏటా జరిగే విధానమే ఇప్పుడూ పునరావృతమైంది. ఈ ఏడాది కూడా గుత్తేదారులు సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే ప్రయత్నాలు మొదలుపెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను అధికారులు బుధవారం సంత వేలాన్ని నిర్వహించారు. కేవలం ఐదుగురు మాత్రమే వచ్చి మద్దతు ధరలో సగం వరకు మాత్రమే పాటలో పాల్గొని వెనుదిరిగారు. నిరుడు రూ.62 లక్షలకు వేలం పాడగా ఈసారి కేవలం రూ.32 లక్షల వరకు మాత్రమే పాటదారులు పాల్గొన్నారు. మద్దతు ధర రాక పోవడంతో స్పెషల్ ఆఫీసర్, ఎంపీఈవో రామచందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి నరేశ్ వేలాన్ని ఈ నెల 11కు వాయిదా వేశారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్-1** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్ట్రర్ తనఖా చేయించుకొని **షేక్ అరిఫా**, W/o : షేక్ కుందే సాహెబ్, వయస్సు : 27 సం॥లు, వృత్తి : గృహిణి, నివాసం : ఇ.నెం. 3-3, రఘునాథపాలెం గ్రామము, రఘునాథపాలెం మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్షయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా అశ్వారెన్నుల రిజిష్ట్రారు మరియు కూసుమంచి సబ్ రిజిష్ట్రారు వారి అధికార పరిధిలో ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్, ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలం, రఘునాథపాలెం రెవిన్యూ గ్రామ మిం.లే. రఘునాథపాలెం గ్రామ పంచాయితి పరిధిలోని ఇ.నెం. 3-3, స్థల విస్తీర్ణం : చ॥గ॥ 200-00 = 167-22 చ॥మీ॥లలో నిర్మించబడిన R.C.C. Roof House గల ఇంటి నిర్మాణ వైశాల్యం : 632.58 చ॥అ॥ & R.C.C.Roof Toilets, గల నిర్మాణ వైశాల్యం : 43.30 చ॥అ॥, డాక్యుమెంట్ నెం. 3115/2018 గల స్థిరాస్తినకు హద్దులు : **తూర్పు :** ఎ.రవి గారి నివాస గృహము, **పడమర :** 15''-0' అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం :** షేక్ మీరా గారి నివాస గృహము, **దక్షిణం :** ఎ.భిక్షం గారి నివాస గృహము.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

నిబంధనల మేరకే వార్షికోత్సవాలు చేయండి

- నగదు వసూళ్లు చేయొద్దు.. డీజే శబ్దాలు పెట్టొద్దు..
- వసతులు, విద్య గురించి తల్లిదండ్రులకు తెలియాలి
- ప్రభుత్వ పాఠశాలలకు ఖమ్మం డీఈవో ఆదేశాలు

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 6: పేరు కోసం, ప్రచారం కోసం ప్రైవేట్ పాఠశాలలన్నీ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తుండడం చూస్తున్నాం. అలాగే కొన్ని నిబంధనలు, షరతుల మేరకు ఇక నుంచి జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు కూడా వార్షికోత్సవాలు చేయబోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో 'స్కూల్ యాన్యువల్ డే'లు చేయాలని ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మ బుధవారం ఎంఈవోలకు, హెచ్ఎంలకు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఫంక్షన్ బాగా జరగాలని, విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయొద్దని, డీజేలు శబ్దాలు పెట్టొద్దని అందులో సూచించారు. అతిక్రమిస్తే మాత్రం కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు.

మరి ఖర్చులు ఎలా..?

పాఠశాలల వార్షికోత్సవాలు చేయాలని డీఈవో ఇచ్చిన ఆదేశాలతో ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు అయోమయానికి గురవుతున్నారు. పాఠశాల వార్షికోత్సవం చేయడమంటే కొంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ముఖ్యంగా నగదును ఎలా సమీకరించుకోవాలన్నదే అసలు ప్రశ్న. ఈ విషయంపైనే ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. విద్యార్థుల కోసం, పాఠశాల అభివృద్ధి కోసం అయితే దాతలు సహకరిస్తారు. కానీ వేడుకలంటే ఎవరు సహకరిస్తారు అనేది వారి ప్రశ్న. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి సాధారణంగా చేసినా కనీసం రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు అవుతుందని అంచనా వేస్తున్నారు. మరి ఇంత నగదును సమకూర్చుకోవడం ఎలా సాధ్యమన్నది ఓ ప్రధానోపాధ్యాయుడి ఆవేదన.

సమయంలోనూ స్పష్టత లేదు..

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కూడా వార్షికోత్సవాలు చేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు కూడా ప్రారంభం కాబోతున్నాయి. ఈ పరిస్థితుల్లో వార్షికోత్సవాలు ఉదయం చేయాలా? లేక సాయంత్రం చేయాలా? అనే విషయంపై ఆ ఉత్తర్వుల్లో ఎలాంటి స్పష్టతా లేదు. ఉదయం చేయాల్సి వస్తే కనీసంగా టెంట్ వేయాలి. తల్లిదండ్రులకు స్నాక్స్ అందించాలి. విద్యార్థులకు మెమెంటోలు తేవాలి. సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. ఇవన్నీ కాస్త ఆర్థికభారంతో కూడుకొని ఉన్నవే. మరి ఇవన్నీ ఎలా చేయాలన్నదే అసలు ప్రశ్న అంటున్నారు ఓ ప్రధాన ఉపాధ్యాయ సంఘ నాయకుడు. వీటితోపాటు కో-కరిక్యులర్ యాక్టివిటీస్‌లో విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించాలంటే ప్రాక్టీసుకే కనీసంగా నాలుగైదు రోజులు సమయం పడుతుంది. పరీక్షలు దగ్గర పడుతున్న వేళ ఈ వార్షికోత్సవాలు నిర్వహణ అనేది ఇదంతా సమయం వృథాకు దారితీస్తుందేమోనని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

హంగులు లేకుండా నిర్వహించాలి

పాఠశాలలో ఉన్న వసతులు, విద్యార్థులకు అందిస్తున్న విద్య వంటివి తల్లిదండ్రులకు తెలిసేలా వార్షికోత్సవాలు నిర్వహించాలి. వార్షికోత్సవాల పేరుతో మరీ హంగు లేమీ వద్దు. అందులోనూ విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయొద్దు. డీజేలు పెట్టొద్దు. వీటిని అతిక్రమించిన ఉపాధ్యాయులపై కఠిన చర్యలుంటాయి. వార్షికోత్సవాల నిర్వహణను ఎంఈవోలు పర్యవేక్షిస్తారు.

-సోమశేఖరశర్మ, డీఈవో, ఖమ్మం

పీడీఎస్ బియ్యం పట్టివేత

కారేపల్లి, మార్చి 6: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని బుధవారం కారేపల్లి ఎస్సై రాజారాం, ఆర్ఐ జార్జీ పట్టుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. సుమారు 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం బస్తాలు ఉన్న మినీ వ్యాన్ మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో స్థానికులకు కనిపించింది. దీంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు వాహనాన్ని పట్టుకొని విచారణ చేపట్టినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.

బియ్యం తరలిస్తున్న లారీ స్వాధీనం

బోనకల్లు, మార్చి 6: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు వైరా ఏసీపీ రెహమాన్ తెలిపారు. బోనకల్లు, రావినూతల సమీపంలో బోనకల్లు ఎస్సై మధుబాబు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా లారీ పట్టుబడినట్లు పేర్కొన్నారు. 400 బస్తాల్లో సుమారు 20 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని లారీడ్రైవర్ మస్తాన్, జగదీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అటవీ సిబ్బందికి వైద్య శిబిరం

సత్తుపల్లి రూరల్, మార్చి 6: సింగరేణి సంస్థ, ఎల్‌వీ కంటి ఆసుపత్రి సహకారంతో సత్తుపల్లి డివిజన్‌లోని అటవీ సిబ్బందికి బుధవారం స్థానిక నీలాద్రి అర్బన్‌పార్కులో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు 100 మంది సిబ్బందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ముదిగొండ, మార్చి 6: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని శిక్షణ కలెక్టర్ మయాంక్ అగర్వాల్ అన్నారు. మండల కేంద్రమైన ముదిగొండలో బుధవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని చేతిపంపులు, తాగునీటి వసతిని పరిశీలించారు. ఎంపీడీవో శ్రీధర్ స్వామి, ఎంపీఈ సూర్యనారాయణ, ఏఈ విజయరాజు పాల్గొన్నారు.

'వరి రైతులను ఆదుకోవాలి'

కూసుమంచి, మార్చి 6: పాలేరు పాత కాలువ కింద ఎండిపోయిన పొలాల రైతులను ఆదుకోవాలని సీపీఎం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ కోరారు. మండలంలోని పాత కాలువ కింద గల పెరికసింగారం, జక్కేపల్లి, గోరీల పాడుతండాలోని వరి పొలాలను బుధవారం రైతులతో కలిసి పరిశీలించారు.

బీమా పరిహారం అందజేత

ఎర్రుపాలెం, మార్చి 6: మండలంలోని అయ్యవారిగూడెం సొసైటీ సభ్యుడిగా ఉండి ఇటీవల మృతిచెందిన భీమవరం గ్రామానికి చెందిన వెల్లటూరి భ్రమరాంబకు మంజూరైన బీమా నగదును బుధవారం అందజేశారు. డీసీసీబీ ఎర్రుపాలెం బ్రాంచిలో సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు రూ.50 వేల బీమా పరిహారాన్ని మృతురాలి భర్త సత్యనారాయణకు అందించారు.

'నీలాద్రి' సభ్యుడిగా రామిశెట్టి

సత్తుపల్లి టౌన్, మార్చి 6: పెనుబల్లి మండలంలోని నీలాద్రీశ్వరాలయ పాలకమండలి సభ్యుడిగా పట్టణానికి చెందిన రామిశెట్టి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే మట్టా రాగమయి నియమించారు.

టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా మల్లయ్య

బొండ్ల మల్లయ్య

మామిళ్లగూడెం, మార్చి 6: ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా బొండ్ల మల్లయ్య బుధవారం విధుల్లో చేరారు. ఆయన ఇటీవల బదిలీపై ఇక్కడకు వచ్చారు.

నేటి నుంచి తీర్థాల జాతర

ఏర్పాట్లను సమీక్షించిన పోలీస్ అధికారులు

ముస్తాబైన తీర్థాల ఆలయం

ఖమ్మం రూరల్, మార్చి 6: ఏటా మూడ్రోజులపాటు జరిగే తీర్థాల సంగమేశ్వర స్వామి దేవస్థానం (కూడలి) జాతర గురువారం ప్రారంభంకానున్నది. ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆలయానికి వచ్చి అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 11 వరకు మహోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. 7న ధ్వజరోహణం, దీక్షాధారణ, వాస్తుహోమం జరగనున్నాయి. 8న అభిషేకాలు, బలిహరణం రాత్రి 12 గంటలకు స్వామివారి కల్యాణం జరుగనున్నాయి. 9, 10 తేదీల్లో ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, నాగబలి, పూర్ణహారతి నిర్వహించనున్నారు. 11న చివరిరోజు దోపు ఉత్సవంతో మహోత్సవాలు ముగియనున్నాయి.

భద్రతా ఏర్పాట్లలో పోలీస్ అధికారులు

వారం రోజుల నుంచి ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, ఎస్సై సురేశ్ వరుస సమీక్షలు చేపడుతున్నారు. బుధవారం తీర్థాల గ్రామంలో అదనపు డీసీపీ గణేశ్, ఆర్డీవో గణేశ్, ఏసీపీలు తిరుపతిరెడ్డి, ఏసీపీ శ్రీనివాసు సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. తహసీల్దార్ రాంప్రసాద్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సమత, ఈవో శేషయ్య, రూరల్ ఎస్సై సురేశ్‌తో పాటు ట్రాఫిక్ సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యవంతం కావాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఖమ్మం వ్యవసాయం: బ్యాంకులో మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మధిర/ మామిళ్లగూడెం/ ఖమ్మం వ్యవసాయం, మార్చి 6: మహిళలు మరింత చైతన్యం కావాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మహిళా దినోత్సవం బుధవారం సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కేంద్రంలో సీడీపీవో శారదాశాంతి అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళా న్యాయ అవగాహన పొందాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళలే కీలకం

సమాజాభివృద్ధిలో మహిళలే కీలకమని స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ స్వర్ణకుమారి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని జడ్పీ సమావేశ మందిరంలో సావిత్రీబాయి పూలే మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పీఆర్ దేవి అధ్యక్షత బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యతోనే మహిళల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం సఖి అడ్మిన్ సరిత, పీజీ కాలేజ్ అధ్యాపకురాలు లక్ష్మీహరిత, అడ్వకేట్ షేక్ నజీమా, మహిళ ఆరోగ్య నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రేమలత, జర్నలిస్ట్ మధులత మాట్లాడారు.

బ్యాంక్ మహిళా ఖాతాదారులకు వైద్య శిబిరం

మహిళా దినోత్సవం సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఖాతాదారులైన మహిళల కోసం బ్యాంక్ అధికారులు వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. తమ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని ఖమ్మం రీజియన్ హెడ్-డీజీఎం హన్మంతరెడ్డి తెలిపారు.

'కృతజ్ఞత సభ'ను విజయవంతం చేయండి: సండ్ర

వృద్ధురాలిని పరామర్శిస్తున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, మార్చి 6: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన ఖమ్మంలో గురువారం జరిగే ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ సమీక్షా సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అదేవిధంగా బీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్రను రెండోసారి ఎంపిక చేసినందుకు ఏర్పాటు చేసిన 'కేసీఆర్‌కు కృతజ్ఞత' సభను కూడా పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు మాట తప్పిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల ద్వంద్వవైఖరిని ఎండగట్టేందుకు ప్రజల పక్షాన తాము ఎప్పుడూ పోరాడేందుకు సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శలు

పెనుబల్లి/ సత్తుపల్లి రూరల్/ సత్తుపల్లి టౌన్, మార్చి 6: మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పెనుబల్లి, సత్తుపల్లి మండలాల్లో బుధవారం పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు.. యువకుడి మృతి

ఖమ్మం రూరల్, మార్చి 6: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకున్నది. ఖమ్మం రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. ముదిగొండ గ్రామానికి చెందిన పందిరి గౌతమ్ (21), మెట్టెల వినయ్ ముదిగొండ నుంచి కారులో వరంగల్‌కు బయలుదేరాడు. ఆరెంపుల గ్రామం వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో గౌతమ్ అక్కడికక్కడే మృతిచెందగా వినయ్‌కు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత పద్ధతిలోనే కరెంటు బిల్లులు..

కార్యాలయాలకు ప్రజల పరుగులు..

కార్యాలయంలో దరఖాస్తులు అందిస్తున్న మహిళ

వేంసూరు, మార్చి 6: గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వారందరికీ మార్చి నుంచి జీరో బిల్లులు వస్తుందని ప్రభుత్వం ప్రకటించినా మండలంలో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. కొన్ని గ్రామాల్లో ఇంకా పాత పద్ధతిలోనే విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. దీంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. మళ్లీ దరఖాస్తులు అందించేందుకు మూడు రోజులుగా ఎంపీడీవో కార్యాలయంలో గృహజ్యోతి సేవా కేంద్రానికి పరుగులు పెడుతున్నారు. తాము వంద యూనిట్ల లోపు కరెంటు వినియోగించినా తమ జీరో బిల్లులు రావడంలేదంటూ మండలంలోని 26 పంచాయతీల నుంచి వచ్చిన ప్రజలు అక్కడ వాపోతున్నారు. ఈ విషయంపై కొందరు ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను అడిగితే.. వారేమో ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించి పంపుతున్నారు. దీంతో ప్రజల్లో గందరగోళం మొదలైంది.

బీఆర్ఎస్ నాయకుడు దేవబత్తిని కిశోర్ అరెస్ట్

మామిళ్లగూడెం,మార్చి 6: బీఆర్ఎస్ యువజన విభాగం నగర అధ్యక్షుడు దేవబత్తిని కిశోర్‌ను బుధవారం ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. 2023 మే 28న నగరంలోని బైపాస్ రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్‌టీఆర్ జయంతి వేడుకలో మాజీ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు, పాల్వంచకు చెందిన చీకటి కార్తీక్ పాల్గొన్నారు. తనపై దేవబత్తిని కిశోర్‌తోపాటు రామానాయుడు, వీరేంద్రగౌడ్, ప్రదీప్, సందీప్, సురేశ్ దాడి చేయడంతో కాలు విరిగిందని, కులం పేరుతో దూషించారని మే 30న టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో చీకటి కార్తీక్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్టు పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో దేవబత్తిని కిశోర్‌ను టూటౌన్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను కిశోర్‌పై నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచేశారు. వైద్య పరీక్షల అనంతరం కిశోర్‌కు 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

రుసుముల వసూలుపై బీఆర్ఎస్ నిరసన

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

సత్తుపల్లి, మార్చి 6: కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీల మేరకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చైర్మన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు నిరసన తెలిపి కమిషనర్ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ కూసంపూడి రామారావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులను క్రమబద్ధీకరించాలి'

మున్సిపల్ కమిషనర్‌కు వినతి ఇస్తున్న నేతలు

మధిర, మార్చి 6: ఎల్ ఆర్ఎస్ అప్లికేషన్లను ఉచితంగా క్రమబద్ధకరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లబోతుల వెంకటేశ్వర్లు, బిక్కి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వాటిని వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. నాయకులు శ్రీనివాసరావు, భాస్కర్‌రెడ్డి, అప్పారావు, కిరణ్, నాగేశ్వరరావు, ప్యారీ, జగన్మోహన్‌రావు, నారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జడ్పీ చైర్మన్ పరామర్శ


బాధితురాలిని పరామర్శిస్తున్న జడ్పీ చైర్మన్

మధిర/ ఎర్రుపాలెం, మార్చి 6: మధిర మున్సిపల్ కౌన్సిలర్ గద్దల మాధురి అత్త ప్రశాంతను జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌ర